క్లుప్తంగా

ఎంపీపీ జబీన్‌కు అభినందనలు



దుగ్గిరాల: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా నియమించిన హజ్ కమిటీలో దుగ్గిరాల ఎంపీపీ షేక్ జబీన్ నియామకంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. గురువారం మండల పరిషత్ సమావేశమందిరంలో జరిగిన సమావేశంలో షేక్ జబీన్‌ను పలువురు నేతలు, అధికారులు అభినందించి, సత్కరించారు. ఎంపీడీఓ ఎ.శ్రీనివాస రావు, డిప్యూటీ ఎంపీడీఓ కె.జె.నెహ్రూ, ఎ.ఓ చంద్రమోహన్, రేవేంద్రపాడు మాజీ సర్పంచ్ శ్రీనివాస్, షేక్ సాధిక్, బాపయ్య, తదితర నాయకులు పాల్గొన్నారు.

క్షయవ్యాధి అంతం అందరి లక్ష్యం కావాలి



దుగ్గిరాల: క్షయ వ్యాధిని కేంద్రప్రభుత్వం ప్రవేశ పెట్టిన సీవై టీబీ టెస్ట్ ద్వారా ముందుగానే గుర్తించి, నివారించ వచ్చని దుగ్గిరాల పీహెచ్‌సీ వైద్యాధికారి ఇజాజ్ అబ్దుల్ పేర్కొన్నారు. గురువారం దుగ్గిరాల పీహెచ్‌సీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. క్షయ వ్యాధిని ముందుగా గుర్తించి ప్రివెన్షన్ థెరపీ అందించడం ద్వారా భవిష్యత్తులో క్షయవ్యాధి వచ్చే అవకాశం ఉండదని, తద్వారా క్షయరహిత దేశం సాధ్యమవుతుందన్నారు. ప్రజలు తగుజాగ్రత్తలు తీసుకుంటూ, ఆరోగ్యంగా ఉండాలని అన్నారు. అనంతరం రోగులకు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎయిమ్స్ డాక్టర్ ఉత్కర్ష, హెల్త్ ఎడ్యుకేటర్ వి.సుబ్బారావు, పి.రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

రెడ్ షర్ట్ వలంటీర్ల కవాతు



చినకాకాని(మంగళగిరి): నగర పరిధిలోని చినకాకానిలో ఏడు రోజులుగా కొనసాగుతున్న జనసేవాదళ్ రాష్ట్రస్థాయి శిక్షణా శిబిరంలో గురువారం శిక్షణ తీసుకున్న జనసేవాదళ్ వలంటీర్లు రెడ్ షర్ట్ కవాతు నిర్వహించారు. తొలుత యార్లగడ్డ విగ్రహానికి సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చిన కాకాని పార్టీ కార్యాలయం నుంచి పురవీధులలో నిర్వహించిన రెడ్ షర్ట్ వలంటీర్ కవాతులో పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు చిన్ని తిరుపతయ్య, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, కంచర్ల కాశయ్య, పిల్లలమర్రి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణం వద్దంటూ ధర్నా



దుగ్గిరాల: పవిత్రమైన విద్యాలయాలు, దేవాలయాల మధ్యలో మద్యం దుకాణానికి అనుమతులు ఇవ్వడం దారుణమని, తక్షణమే మద్యం దుకాణాన్ని తరలించాలని మండలంలోని చిలువూరు గ్రామస్తులు ధర్నా చేశారు. గురువారం జరిగిన ధర్నాలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ ఆంధ్ర కేసరి స్టేట్ లీగల్ కన్వీనర్ నాగరాజు మాదిగ మాట్లాడుతూ గ్రామంలో ఇప్పటికే ఒక మద్యం దుకాణం ఉండగా, రెండో దానికి ఎలా అనుమతులు ఇస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాలయాలు, దేవాలయం దగ్గర్లో ఏర్పాటు చేయనున్న దుకాణాన్ని తరలించాలన్నారు. ధర్నాలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసులు

తెనాలిరూరల్: చిన్న పిల్లలు ఆడుకునే విషయంలో జరిగిన గొడవలో పెద్దలు కలుగజేసుకుని రెండు వర్గాలుగా విడిపోయి పరస్పర దాడికి పాల్పడిన ఘటనపై రూరల్ పోలీసులు నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేశారు. పెదరావూరులోని చినపల్లెలో ఈ నెల 12వ తేదీ రాత్రి చిన్న పిల్లలు ఆడుకునే విషయంలో గొడవ జరిగింది. ఇందులో పెద్దలు కలుగేసుకుని, గరిక వెంకటేశ్వర రావు ఒక వర్గంగా, కనపర్తి శిరీష మరో వర్గంగా విడిపోయి పరస్పర దాడులకు పాల్పడ్డారు. ఘటనలో 10 మందిపై గురువారం నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేసినట్టు రూరల్ ఎస్‌ఐ కె. ఆనంద్ తెలిపారు.

లింగాకర్షణ బుట్టల వినియోగంపై అవగాహన

తెనాలిటౌన్: తెల్ల దోమల నివారణ, తామరపురుగు ఆకర్షించే లింగాకర్షణ బుట్టలు, జిగురు అట్టల వినియోగంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు సూచించారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన అవసరం

- జిల్లా ఎన్ఎఫ్ఏ ఉమాదేవి
- 113 త్యాళ్లూరులో రైతులకు విత్తనాల కిట్లు పంపిణీ



విత్తనాల కిట్లు అందజేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

ఫిరంగిపురం: మండలంలోని 113 త్యాళ్లూరు గ్రామంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా ఏ రుతువుల్లో ఏ పంటలు వేసుకోవాలనే విషయాలపై రైతులకు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది గురువారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా నేచురల్ ఫార్మింగ్ అసోసియేట్ ఉమాదేవి మాట్లాడుతూ పంట వేసుకునే ముందు భూములు సారవంతంగా ఉండేందుకు గాను ఎరువులు వాడకుండా తగిన విధంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించాలన్నారు. ప్రి మాన్‌సూన్ డ్రై సోయింగ్ (పీఎండీఎస్) కిట్ల ద్వారా 30 రకాల విత్తనాలు పొలంలో చల్లుకోవాలని సూచించారు. దానిద్వారా పంట దశలో వచ్చిన వాటిని ఉపయోగించుకోవాలని చెప్పారు. మిగిలి ఉన్నదానిని భూమిని దున్నివేయడం ద్వారా సారవంతం అయ్యేందుకు వీలవుతుందని తెలిపారు. మిరియాల సాయిబాబా పొలంలో 30 రకాల విత్తనాలు విత్తుకొనే విధానం గురించి వివరించారు. మోడల్ మేకర్లు ఇ.వెంకటేశ్వర్లు, అన్నామణి, యూనిట్ ఇన్‌చార్జిలు జె.రామకృష్ణ, తిరుపతిరావు, ఐసీఆర్‌పీలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో మంచి ఆరోగ్యం



గర్భిణులచే ప్రతిజ్ఞ చేయిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సునీత

ఫిరంగిపురం: మండలంలోని మునగపాడు గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో పౌష్టికాహార వారోత్సవం గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం చక్కగా ఉంటుందన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలతో కూడిన ఆహారం తయారు చేసుకొనే విధానం గురించి వారికి వివరించారు. పిల్లల్లో ఊబకాయాన్ని నివారించేందుకు వారికి అవసరమైన ఆహార జీవనశైలిలో మార్పులు గురించి తెలియజేశారు. ప్రతిరోజు పౌష్టికాహారం తీసుకుంటామని వారిచే ప్రతిజ్ఞ చేయించారు. అంగన్‌వాడీ టీచర్ మేరీ, ఆయాలు పాల్గొన్నారు.

పోషణ్ పక్వాడాపై అవగాహన

తాడేపల్లి రూరల్: ఉండవల్లిలోని అంగన్‌వాడీ సెంటర్ నందు మంగళగిరి ప్రాజెక్టు, పెనుమాక సెక్టార్ ఆధ్వర్యంలో గురువారం పోషణ్ పక్వాడాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన పెనుమాక సెక్టార్ సూపర్‌వైజర్ పి.శిరోమణి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు ఎక్కువ పోషకాలు ఉండే ఆహారాన్ని తీసుకోవాలన్నారు. చిన్నారులకు సకాలంలో టీకాలు వేయించాలని, బాలామృతం, పాలు, కోడిగుడ్లు, బీఎస్ కిట్స్, రైస్, పప్పు, ఆయిల్‌ను అందరూ వినియోగించుకోవాలని తెలిపారు. అరుణకుమారి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ఎస్ఐ ప్రతాప్‌కుమార్ బాధ్యతల స్వీకారం



బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ ప్రతాప్‌ను అభినందిస్తున్న డీఎస్పీ మురళీకృష్ణ

తాడేపల్లి రూరల్: నార్త్ సబ్‌డివిజన్ పరిధిలోని తాడేపల్లి పోలీస్‌స్టేషన్ నూతన ఎస్ఐగా ప్రతాప్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రతాప్‌కుమార్ గతంలో తాడేపల్లి, దుగ్గిరాల, తెనాలి పోలీస్‌స్టేషన్‌లలో ఎస్ఐగా విధులు నిర్వహించారు. తెనాలి నుంచి తాడేపల్లికి బదిలీ అయిన ప్రతాప్ మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా కృషి చేస్తానని, తాడేపల్లి ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని కోరారు. తాడేపల్లి ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులకు సమన్వయం అందిస్తానని పేర్కొన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించే వారిపై చట్టరీత్యా కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. ముందుగా నార్త్ సబ్ డివిజన్ డీఎస్పీ మురళీకృష్ణను కలిసి పూలమొక్కను అందజేశారు. బాధ్యతలు స్వీకరించిన ప్రతాప్‌కు తాడేపల్లి సీఐ కల్యాణ్‌రాజు, ఎస్ఐ ఖాజావలి, స్టేషన్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

బాలల సమ్మర్ క్యాంప్ బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న గాదె సుబ్బారెడ్డి తదితరులు

తాడేపల్లి రూరల్: మంగళగిరి-తాడేపల్లి బాలోత్సవం ఆధ్వర్యంలో వేసవి సెలవుల్లో నిర్వహించనున్న బాలల సమ్మర్ క్యాంప్ బ్రోచర్‌ను గురువారం గుడ్‌న్యూస్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ జె.ఆరోగ్యదాస్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గాదె సుబ్బారెడ్డి మాట్లాడుతూ నాల్గవ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులకు ఏప్రిల్ 23వ తేదీ నుంచి 30 వరకు ఏడు రోజుల పాటు నిర్వహించనున్న సమ్మర్ క్యాంప్‌లో వెస్ట్రన్ డ్యాన్స్, జానపద నృత్యాలు, కోలాటాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. తాడేపల్లిలో ఏ పాఠశాలలో చదివే విద్యార్థయినా ఈ శిక్షణా తరగతులకు హాజరు కావచ్చన్నారు. మరిన్ని వివరాలకు 8106299498, 9866029486 నెంబర్లలో సంప్రదించాలని కోరారు. గుడ్‌న్యూస్ హైస్కూల్ పీటీ అజయ్ కుమార్, బాలోత్సవం ప్రతినిధి బిట్ర రామారావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై నిషేధం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా, అధికారులు

మంగళగిరి టౌన్: సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధిస్తున్నట్లు ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిలో కలవడానికి కనీసం 500 సంవత్సరాలు పడుతుందని, వర్షాలు పడితే నీటిలో కలుస్తాయని దీనివల్ల పర్యావరణం కలుషితమవుతుందని అన్నారు. 120 మైక్రోన్‌ల కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్‌ను నగరంలో విక్రయించడం, వినియోగించడం నిషేధమని, ఎవరైనా అతిక్రమిస్తే జరిమానాలు విధిస్తామని కమిషనర్ హెచ్చరించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలతో పాటు ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ వస్తువుల వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అడిషనల్ కమిషనర్ శకుంతల, అధికారులు యశోదరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా సమగ్ర చర్యలు చేపట్టండి



సభ్యుల ప్రశ్నలకు సమాధానం ఇస్తున్న ఈఓపీఆర్డీ ప్రసాద్

తెనాలిటౌన్: వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా సమగ్ర చర్యలు చేపట్టాలని అధికార యంత్రాగాన్ని ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సాధారణ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఎంపీపీ చెన్నకేశవులు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశానికి 14 మంది ఎంపీటీసీలు హాజరుకాగా, 7గురు గైర్హజరయ్యారు. వేసవి దృష్ట్యా త్రాగునీటి సమస్యలు ఉన్న గ్రామాలను గుర్తించి చేతిపంపులు, నీటి కుళాయి కనెక్షన్‌లు సత్వరం ఇవ్వాలని సూచించారు. అవసరమైన చోట్ల బోర్లు నిర్మాణం చేపట్టాలని తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పనులను ఆశాఖ సిబ్బంది తెలియజేశారు. ఎక్కడ అవినీతి అవకాశం లేకుండా ప్రతిష్ట చర్యలు చేపట్టాలని ఎంపీపీ సూచించారు.

2024-25 సంవత్సరానికి సంబంధించి మండల పరిషత్ సంవత్సరిక లెక్కలను ఆమోదించారు. 31 మార్చి 2025 నాటికి ఇంకను ప్రారంభించని పనులను రద్దు చేసి వాటి స్థానంలో క్రొత్త పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. గ్రామాల్లో విద్యుత్ లో ఓల్టేజ్ సమస్యలు సభ్యులు తెలియజేశారు. కుక్కల బెడద అధికంగా ఉందని, నివారించాలని కోరారు. గుడివాడ గ్రామంలో చేతిపంపుల అవసరత అధికంగా ఉందని, తక్షణం మంజూరు చేయాలని మాజీ ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాస రావు కోరారు. కొలకలూరు గ్రామ పంచాయతీ పరిధిలో అనేక రకాలుగా అవినీతి జరుగుతుందని ఎంపీటీసీ కాలిశెట్టి ఫణీకుమార్ ఆరోపించారు. సమగ్రమైన బిల్లులు లేకుండా శానిటేషన్ సిబ్బంది ఖాతాల్లో పెద్ద మొత్తంలో నగదు జమ చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో ఉపాధ్యక్షురాలు కోడూరి స్వప్న, ఎంపీడీవో అత్తోట దీప్తి, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బాలయేసు చర్చి ప్రథమ వార్షికోత్సవం



తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని నులకపేటలో వున్న బాలయేసు దేవాలయ ప్రథమ వార్షికోత్సవం గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. తొలుత ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రార్థనల్లో వందలాదిగా విశ్వాసులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయ కర్త దొంతిరెడ్డి వేమారెడ్డి (డీవీఆర్) హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజు, మాజీ కౌన్సిలర్ ఎండీ గోరే తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



చినకాకాని(మంగళగిరి): అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా నగర పరిధిలోని చినకాకాని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. మంగళగిరి అగ్నిమాపక శాఖ అధికారి వెంకటేశ్వర్లు, సిబ్బంది అగ్నిప్రమాదాల నివారణ గురించి వివరించారు. అగ్నిప్రమాదాలు చోటు చేసుకున్నపుడు ప్రాణ, ఆస్తి నష్టం జరక్కుండా ముందుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అగ్నిమాపక సిబ్బందికి ఎలా సమాచారమివ్వాలనే అంశాలపై వివరించారు.

రేపు 'ఈ-వ్యర్థాలు నిర్వహణ'

తెనాలిటౌన్: ఈ నెల 19వ తేదీన స్థానిక శివాజీ చౌక్ సెంటర్‌లో ఇ-వ్యర్థాలు నిర్వహణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వర్ణంధ్ర-స్వచ్ఛంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల 3వ శనివారం నిర్వహించే ఇ-వ్యర్థాల నిర్వహణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పట్టణంలోని దుకాణదారులకు పిలుపునిచ్చారు. పాడైపోయిన కంప్యూటర్ పరికరాలు, మొబైల్స్, టేబుల్స్, బల్బులు, బ్యాటరీలు ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకువచ్చి ఇవ్వాలని కోరారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు క్యాంపు ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పారు.

రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాంపై మహిళ మృతి

తెనాలిరూరల్: తెనాలి రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాంపై మహిళ మృతి చెందింది. పట్టణ చెంచుపేటకు చెందిన రేపూరి నాగరంజిత (60) జేఎంజే కళాశాలలో పని చేస్తోంది. గురువారం తెనాలి స్టేషనుకు వచ్చిన ఆమె ఒకటో నంబరు ప్లాట్‌ఫాంపై కుప్పకూలింది. సమాచారం అందుకున్న జీఆర్పీ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించగా ఆమె ఆధార్ కార్డు, కొన్ని కోర్టు పత్రాలు లభించాయి. మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. గతంలో చేసిన అప్పులకు కోర్టులో శాలరీ అటాచ్‌మెంట్ పిటిషన్ వేశారని, ఈ క్రమంలో ఆమె గుండెపోటుతో మృతిచెందిందా లేక మరోదైనా కారణముందా అన్నది పోస్ట్‌మార్టం అనంతరం తెలుస్తుందని జీఆర్పీ ఎస్ఐ వెంకట్రాద్రి తెలిపారు.

క్షయవ్యాధి నివారణకు చర్యలు



తెనాలిఅర్బన్: క్షయవ్యాధి నివారణకు కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని తెనాలి టీబీ యూనిట్ సూపర్ వైజర్ పల్లికొండ రవికుమార్ పేర్కొన్నారు. గంగానమ్మపేట, సాలీపేటలోని అర్బన్‌హెల్త్ సెంటర్‌లలో గురువారం ఊపిరితిత్తుల టీబీకి మందులు వాడుతున్న వ్యాధిగ్రస్తులతో నివాసిస్తున్న కుటుంబ సభ్యులకు సీవై టీబీ టెస్ట్‌లను ఎయిమ్స్ నుంచి వచ్చిన జూనియర్ రెసిడెంట్ వైద్యులు డాక్టర్ ఉత్కర్ష తివారి చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ 2025 నాటి క్షయ వ్యాధి లేని దేశంగా తీర్చిదిద్దేందుకు కేంద్రం కృషి చేస్తుందన్నారు. టీబీ రాకుండా ప్రివెన్సన్ థెరఫీ ఇవ్వవచ్చని తెలిపారు. టీబీ సోకిన వారి కుటుంబ సభ్యులకు వ్యాధి సోకే అవకాశం ఉందన్నారు. వారు అప్రమత్తంగా ఉండాలన్నారు.

కేఎల్‌యూ విద్యార్థులకు బహుమతులు



విద్యార్థినికి బహుమతి, సర్టిఫికెట్ అందజేస్తున్న డాక్టర్ విజయశాంతి, విశ్వనాథ్, డాక్టర్ శ్రీనివాసులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్, వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీలోని ఫుడ్ టెక్నాలజీ విభాగంలోని విద్యార్థులకు బహుమతుల ప్రదానోత్సవం నిర్వహించినట్లు విభాగాధిపతి డాక్టర్ కె.శ్రీనివాసులు తెలియజేశారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫుడ్ టెక్నాలజీ విభాగంలోని మొదటి, రెండవ, మూడవ సంవత్సరాలకు చెందిన విద్యార్థులకు పరిశోధనలపైన నిర్వహించిన పోటీలలో అత్యుత్తమ పరిశోధనా పత్రాలను సమర్పించి, ప్రచురించిన వారిలో ప్రతి విద్యా సంవత్సరం నుంచి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులను ఎంపిక చేసి వారికి సఫలత సమ్మేళన్-2025 సదస్సులో బహుమతులు ఇస్తున్నామన్నారు. ప్రథమ బహుమతి రూ. 2500, ద్వితీయ బహుమతి రూ.2వేలు, తృతీయ బహుమతి కింద రూ.వెయ్యి నగదు బహుమతులను కాంటినెంటల్ కాఫీ ఫ్యాక్టరీ ప్రొడెక్షన్ హెడ్ డాక్టర్ కె.విజయశాంతి, ఆపరేషనల్ హెడ్ కె. విశ్వనాథ్‌లు ముఖ్యఅతిధులుగా విచ్చేసి విద్యార్థులకు అందజేసినట్లు తెలిపారు. వర్శిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారధి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ కె.రాజశేఖరరావు, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్‌చార్జి డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కు పొందాలి



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి ఎం.గంగరాజు

తాడికొండ: 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఫామ్-6 ద్వారా ఓటు హక్కు కల్పించాలని నియోజకవర్గ ఎన్నికల నిర్వహణ అధికారి ఎం.గంగరాజు సూచించారు. గురువారం తాడికొండ షిరిడీ సాయి పత్తిసాయి మందిర కళ్యాణ మండపంలో నిర్వహించిన శిక్షణా సమావేశంలో బీఎల్వోలు, ఏఈఆర్వోలు, సూపర్‌వైజర్‌లకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మృతిచెందిన ఓటర్లు, ఇతర రాష్ట్రాలకు శాశ్వతంగా తరలిపోయిన వారి ఓటును ఫామ్-7 ద్వారా తొలగించేందుకు అర్జీ దాఖలు చేయాలని, ఓటరు జాబితాలో ఓటరు పేరు, ఇంటిపేరు, గ్రామం, వీధి, పేరు, పుట్టిన తేదీ, లింగం తప్పుగా నమోదై ఉంటే, ఫామ్-8 ద్వారా సరిచేసేందుకు అర్జీ దాఖలు చేసుకోవచ్చన్నారు. ఓటరు తన నివాసం వేరే ప్రాంతానికి మార్చుకున్న వారు వారి ఓటు హక్కును ఫామ్-8 ద్వారా మార్చుకోవచ్చన్నారు. దివ్యాంగులు వైద్యుల సర్టిఫికెట్‌తో ఫామ్-8 ద్వారా పీడబ్ల్యూడీ ఓటరుగా నమోదు చేసుకోవచ్చన్నారు. జంక్, జీరో డోర్ నంబర్లు లేని ఆరోగ్యకరమైన ఓటర్ల జాబితా తయారు చేసేందుకు సిబ్బంది సహాయ సహకారాలు అందజేయాలన్నారు. బీఎల్ఓలు తమకు కేటాయించిన అన్ని రకాల ఫారాలు రెండు, మూడు రోజుల్లో విచారించి సరైన నివేదిక పొందుపరిచి తహసీల్దార్ కార్యాలయంలో ఏఈఆర్వో లాగిన్‌కు ఫార్వర్డ్ చేయాలని సూచించారు. ఏఈఓఆర్వో, తాడికొండ తహసీల్దార్ పి.మెహర్‌కుమార్, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ నల్లా, తాడికొండ, తుళ్లూరు మండలాలకు చెందిన పలువురు ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

కందుకూరి పురస్కారం అందుకున్న 'గాదె'



కందుకూరి విశిష్ట పురస్కారాన్ని అందుకుంటున్న గాదె నాగభూషణం

తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లికి చెందిన నటుడు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కందుకూరి పురస్కారాన్ని గురువారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన తెలుగు నాటక రంగ దినోత్సవ వేడుకల్లో అందుకున్నారు. ఉండవల్లికి చెందిన గాదె నాగభూషణం 1998 జనవరి 14న ఉండవల్లి రామాలయంలో పద్మవ్యూహం నాటికలో ఇంటియజమాని పాత్ర పోషించడం ద్వారా రంగస్థల ప్రవేశం చేశారు. ఆనాటి నుంచి వీధి నాటికలు, పౌరాణిక, సాంఘిక నాటికలు, సినిమాలు, షార్ట్ ఫిలిమ్స్ చేస్తూ కళారంగంలో నటుడుగా, రచయితగా, దర్శకుడుగా ఎన్నో అవార్డులు, రివార్డులు సాధించారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన కందుకూరి విశిష్ట పురస్కారాన్ని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్, నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాల కృష్ణ, ప్రముఖ సినీ రచయిత బుర్రా సాయిమాధవ్‌ల చేతుల మీదుగా అందుకోవడం సంతోషదాయంగా ఉందని గాదె నాగభూషణం తెలిపారు. నాగభూషణంను పలువురు కళాకారులు, స్థానికులు అభినందించారు.

కార్మికుల సమస్యపై సీఎం జోక్యం చేసుకోవాలి



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న వేముల దుర్గారావు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మనందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జోక్యం చేసుకోవాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ నాయకులు వేముల దుర్గారావు అన్నారు. గురువారం ఏసీసీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరిస్తానని నారా లోకేష్ హామీ ఇచ్చారని, ఇచ్చిన హామీని నిలబెట్టుకుని మంచి నాయకుడిగా పేరు సంపాదించుకోవాలని అన్నారు. సిమెంట్ ఫ్యాక్టరీ భూమి 135 ఎకరాలను వేలం ద్వారా యాజమాన్యం తక్కువ ధరకు కొనుగోలు చేశారని అన్నారు. యాజమాన్యంతో చర్చలు జరిపి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎం.గురవయ్య, హగ్గయ్య, శారద, సువర్ణకుమారి, చరిత, రమణ, అంకయ్య, ఆశీర్వాదం, ఇమాంబీ, బాషా, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార పక్షోత్సవాలు



తేలప్రోలులో పిల్లల ఎత్తు, బరువు చూస్తున్న డాక్టర్ సునీత

తెనాలి: పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్, తెనాలి ప్రాజెక్టు సీడీపీఓ డాక్టర్ ఎం.సునీత గురువారం రూరల్ మండల గ్రామం తేలప్రోలును సందర్శించారు. ఈనెల 8వ తేదీనుంచి ఆరంభమైన పౌష్టికాహార పక్షోత్సవాలు ఈనెల 22 వరకు జరగనున్నాయి. ఇందులో భాగంగా తేలప్రోలులోని నాలుగు అంగన్‌వాడి కేంద్రాలను డాక్టర్ సునీత సందర్శించారు. పోషకాహార లోపంతో ఉన్న పిల్లలకు ఎత్తు, బరువును నమోదు చేవారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఇచ్చే ఆహారంతోపాటు ఇంటిదగ్గర తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉండే ఆహారాన్ని పిల్లలకు ఇవ్వాల్సిన ప్రాముఖ్యతను తల్లిదండ్రులకు వివరించారు. పోషకాహార లోపంతో వున్న పిల్లలు సాధారణ స్థాయికి వచ్చేవరకు అంగన్‌వాడీ కార్యకర్త వారి వారి గృహాలను సందర్శిస్తూ, తగిన విధంగా ఫాలోఅప్ చేయాల్సిన బాధ్యతను వివరించారు. అవసరమైతే వైద్యపరీక్షలకు ప్రాధమిక ఆరోగ్య కేంద్రాలకు పంపేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ వై.యానాదమ్మ, అంగన్‌వాడి కార్యకర్తలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పట్టణ అంగన్‌వాడీ కేంద్రాల్లో...

పౌష్టికాహార పక్షోత్సవాలను గురువారం స్థానిక 22వ వార్డు మఠంబజారులోని 1,2 అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వై.నాగమణి, ఏఎన్ఎం షేక్ బాజీ, మహిళా పోలీస్ ఎన్.సౌజన్య పాల్గొన్నారు. వెయ్యిరోజులపాటు పిల్లల సంరక్షణ గురించి గర్భవతులు, బాలింతలు, ఆర్నెల్ల నుంచి రెండేళ్ల పిల్లల తల్లులకు అవగాహన కల్పించారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు.